సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ఆ నెత్తుటి గాథకు 32 ఏళ్లు..
కరకగూడెం మండలం రాళ్లవాగు వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చి 10 మంది పోలీసులను హతమార్చి 32 ఏళ్లయింది. 8లో



వాగులో గల్లంతైన ఇద్దరు మృతి
కిన్నెరసాని వాగులో గల్లంతైన టేకులపల్లి మండలం లచ్చగూడేనికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30° / 25°
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రిజర్వ్ షట్‌డౌన్‌లో కేటీపీఎస్ విద్యుత్ యూనిట్లు

పాల్వంచ: వర్షాల కారణంగా రాష్ట్రంలో విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో కేటీపీఎస్‌లో 500 మెగావాట్ల ఉత్పత్తిని రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచారు. ఐదో దశ కర్మాగారంలో రెండు రోజులుగా గణనీయంగా డిమాండ్ తగ్గడంతో పాటు జల విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో కేటీపీఎస్‌లో 250 మెగావాట్ల సామర్థ్యం గల 9, 10 యూనిట్లను రిజర్వ్ షట్‌డౌన్‌లో ఉంచారు. కాగా 500 మెగావాట్ల సామర్థ్యం గల 11వ యూనిట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు సాంకేతిక సమస్య తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. సీఈ ఎం.ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తి చేసి గంట వ్యవధిలోనే ఉత్పత్తిని పునరుద్ధరించి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశామని డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో గత రెండేళ్లుగా టీచర్స్ డే వేడుకలు నిర్వహించలేకపోయామని, ఆ రెండు సంవత్సరాల్లో ఉత్తములుగా ఎంపికైన వారిని కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం సత్కరిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది 23 మంది, 2023లో ఎంపికైన 34 మంది, 2022లో ఎంపికైన 43 మంది.. మొత్తం 100 మంది టీచర్లను ఘనంగా సన్మానిస్తామని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ఈ వేడుకకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి రూ.6.16 లక్షల విరాళం


చంద్రకళ–లచ్చిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ముద్దం చంద్రకళ–లచ్చిరెడ్డి దంపతులు మంగళవారం రూ.6.16 లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయ శ్రీ చక్రం, మకర తోరణానికి రూ.2.16 లక్షలు, మండపం గ్రానైట్‌కు రూ.3 లక్షలు, ఆలయ విగ్రహ ప్రతిష్ఠ రోజు అన్నదానానికి రూ.లక్ష సమర్పించారు. భారీ విరాళం అందజేసిన చంద్రకళ–లచ్చిరెడ్డి దంపతులను ఆలయ నిర్మాణ కమిటీ వారు ఘనంగా సన్మానించారు.

ఎస్కేప్ ఎంతో జాప్యం!


ఈనెల 1న పాల్వంచ మండలంలో ప్రధాన కాలువకు పడిన గండి

సీతారామ ఎత్తిపోతల పథకానికి డిజైన్ల మార్పులు, నిధుల జారీలో ఆలస్యం వంటి సమస్యలకు ఇప్పుడు ఇంజనీరింగ్ లోపాలు కూడా తోడయ్యాయా అంటే అవుననే సమాధానం వస్తోంది. సీతారామ ప్రధాన కాలువకు వరుసగా పడుతున్న గండ్లు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

వరదను తట్టుకోలేకపోతున్న సీతారామ ప్రధాన కాలువ
- ఇప్పటికే మూడు సార్లు గండి పడిన వైనం
- ఏడు మోటార్లు ఎత్తిపోస్తే కెనాల్ తట్టుకునేనా ?
- ఆలస్యంగా తెరపైకి ఎస్కేప్ చానల్ నిర్మాణం
- రూ.60 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు

ముందే బయటపడిన గండ్లు..
సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో నీరందించాలనే లక్ష్యంతో సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి జూన్ 15న క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరీక్షించారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు నుంచి ములకలపల్లి మండలం పూసుగూడెం దగ్గర ఉన్న రెండో పంప్‌హౌస్ వరకు 42 కి.మీ.లు ఉన్న ప్రధాన కాలువకు రెండు, మూడు చోట్ల గండి పడిన విషయం వెలుగుచూసింది. వర్షపు నీరు నిలవడం వల్ల కాలువకు తామే గండి కొట్టామంటూ ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఆగస్టు 15న ప్రారంభోత్సవం నాటికి గండి పడిన ప్రదేశాల్లో కాలువ నిర్మాణం చేపట్టి విజయవంతంగా ట్రయల్ రన్, ఆ తర్వాత దిగ్విజయంగా మోటార్లు ఆన్ చేసి పంపుల ద్వారా కాలువలోకి నీరు వదిలారు.

భారీ వర్షాలతో మరోసారి..
ఈనెల 1న సీతారామ ప్రధాన కాలువ ఉన్న అశ్వాపురం మండలంలో 22 సెంటీమీటర్లు, పాల్వంచలో 22 సెం.మీ బూర్గంపాడులో 29 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. దీంతో ఒక్కసారిగా వరద నీరు ప్రధాన కాలువలో భారీగా చేరుకుంది. చివరకు పాల్వంచ మండలం బంద్రుగొండ గ్రామం దగ్గర కాలువపై నుంచి నీరు ప్రవహించడంతో 30 మీటర్ల వెడల్పుతో గండి పడింది. దీంతో వందల ఎకరాల్లో పంటలను వరద ముంచెత్తింది.

రూ.60 కోట్లతో ఎస్కేప్ చానల్
ప్రధాన కాలువ, పంప్‌హౌస్‌ల నిర్మాణ సమయంలోనే కాలువలో అధికంగా వచ్చే వరద నీటిని బయటకు పంపేలా ఎస్కేప్ చానల్ నిర్మించాల్సి ఉంది. కానీ కిన్నెరసాని, ముర్రేడు వాగులపై భారీ అక్విడెక్ట్‌లకు డిజైన్‌లో చోటు కల్పించిన ఇంజనీర్లు.. ఎస్కేప్ చానల్ నిర్మాణంపై దృష్టి సారించలేదు. రూ. వేల కోట్ల వ్యయంతో నిర్మించే ప్రాజెక్టులో ఇంత కీలక విషయాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజా అనుభవాల నేపథ్యంలో ఇప్పుడు రూ. 60 కోట్లతో ఎస్కేప్ చానల్ నిర్మిస్తామని, ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని చెప్పడం కేవలం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికే అనే విమర్శలు వస్తున్నాయి. ఇంజనీర్ల నిర్వాకంతో కాలువ గండ్లు, వాటి తాలుకూ మరమ్మతులతో ప్రజాధనం వృథా అవుతుండగా, గండ్ల వల్ల వచ్చే వరద పొలాలను ముంచెత్తడంతో రైతులు నష్టపోతున్నారు. మరోవైపు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు నిధులు వెచ్చించి తమ పొలాలకు గోదావరి నీటిని మళ్లిస్తారని రైతులు ఆశిస్తున్న తరుణంలో కొత్తగా ఎస్కేప్ చానల్ తెరపైకి వచ్చింది.

గండికి ఇంజనీర్ల యత్నం
పంప్‌హౌస్ – 1 డెలివరీ సిస్టర్న్ సముద్ర మట్టం నుంచి 67 మీటర్ల ఎత్తులో ఉండగా పంప్‌హౌస్ – 2కు సంబంధించిన ఇన్‌టేక్ వెల్ సముద్రమట్టం నుంచి 62 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ రెండింటి మధ్య ఎత్తు వత్యాసం ఐదు మీటర్లు ఉండడంతో గ్రావిటీ ద్వారా పంప్‌హౌస్ – 1 నుంచి పంప్‌హౌజ్ – 2 వైపు నీరు ప్రవహిస్తుంది. అయితే ప్రస్తుతం రెండు పంప్‌హౌస్‌లలో మోటార్లు పని చేయడం లేదు. కానీ భారీ వర్షాల కారణంగా ప్రధాన కాలువలో నీరు ఎక్కువగా చేరిపోయింది. దీంతో రెండో పంప్‌హౌస్ ఇన్‌టేక్ వెల్‌పై నీటి ఒత్తిడి పెరగడంతో పంప్‌హౌస్ ముంపునకు గురయ్యే ప్రమాదం ఎదురైంది. దీంతో ఈనెల 1న ఉదయం ముర్రేడువాగు, కిన్నెరసాని నదులకు దగ్గర ప్రధాన కాలువకు గండి కొట్టేందుకు ఇంజనీర్లు ప్రయత్నించారు. అయితే వరద నీటి ఒత్తిడికి ఇంజనీర్ల ప్రమేయం లేకుండానే మరో చోట ప్రధాన కాలువకు గండి పడింది. ఇది గడిచిన రెండు రోజుల తర్వాత మంగళవారం చంద్రుగొండ మండలం మద్దుకూరు వద్ద ప్రధాన కాలువకు మళ్లీ గండి పడింది.

బీఆర్ఎస్ అండగా ఉంటుంది..

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మున్నేరు బాధితులకు బీఆర్ఎస్ బృందం పరామర్శ


ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం రూరల్: మున్నేరు వరదతో నష్టపోయిన వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భరోసా కల్పించారు. ముంపు ప్రాంతాలైన కరుణగిరి, వెంకటేశ్వరనగర్, జూబ్లీపుర, బొక్కలగడ్డలో ఆయన మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులను ఓదార్చి సమస్యలు తెలుసుకున్నారు. ఈమేరకు పలువురు ప్రభుత్వం అందించే వరద సాయం రూ.10వేలు ఏ రకంగా సరిపోదని.. పరిహారం పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సర్వం కోల్పోయిన తమకు తాగునీరు, ఆహారం సైతం ఇప్పటి వరకు సరిగా అందలేదని తెలిపారు. వరద సమాచారాన్ని ముందస్తుగా ఇవ్వడంతో యంత్రాంగం విఫలమైందని వాపోయారు. ఈ సందర్భంగా నేతలు పలువురి ఇళ్లలోకి వెళ్లి బురదలో కూరుపోయిన వస్తువులను పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడే మున్నేరుకు రిటైనింగ్ వాల్ మంజూరు చేశామని, అది పూర్తయితే ఇబ్బందులు ఉండవన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అయినా బాధితులకు మెరుగైన నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. అనంతరం పువ్వాడ ఫౌండేషన్ తరఫున బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓ సస్పెన్షన్

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ నిధుల దుర్వినియోగంపై ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అబీద్ ఉర్ రెహమాన్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ పి.ఉదయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ పథకంలో పెద్దసంఖ్యలో రైతులకు అర్హత ఉన్నా అమలుకాలేదని 'సాక్షి'లో 'మాఫీ మాయ మంత్రం' శీర్షికన ఆగస్టు 18న కథనం ప్రచురితమైంది. బ్యాంక్ పరిధిలో 1.69 లక్షల మంది రుణమాఫీ కావాల్సి ఉన్నా మూడు విడతల్లో కేవలం 68 వేల మందికే వర్తించింది. ఈ నేపథ్యాన రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక దృష్టి సారించగా అవకతవకలు చోటు చేసుకున్నాయని తేలింది. ఈవిషయమై డీసీసీబీ సీఈఓను వివరణ కోరినా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదని భావించారు. ఈక్రమంలో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ అవధానుల శ్రీనివాసులును విచారణ అధికారిగా నియమించారు.

అర్హత లేకున్నా సిఫారసు
విచారణ అధికారి డీసీసీబీ పరిధి 28 పీఏసీఎస్‌ల్లో రుణమాఫీకి అర్హత కలిగిన 154 మంది రైతులు ఖాతాలను పరిశీలించారు. ఈమేరకు అర్హత ఉందని తేలిన 149 మంది రైతుల వివరాలను అందించటంలో సీఈఓ విఫలమయ్యారని సమాచారం. అంతేకాక అర్హత లేని, మూసివేసిన రుణ ఖాతాలకు మాత్రం రూ.1,31,598 మేర రుణమాఫీ అమలుచేయాలని సీఈఓ సిఫారసు చేశారని తేలింది. ఇక ఓ కుటుంబానికి రూ.2లక్షలకు అదనంగా రూ.59,045, నిర్దేశించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఒకరికి రూ.1,17,553 మాఫీ చేయాలంటూ సీఈఓ సిఫారసు చేశారని గుర్తించారు. దీంతో సీఈఓను సస్పెండ్ చేస్తున్నట్లు సహకార శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

గోదావరిలోకి కిన్నెరసాని నీరు..


కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి మంగళవారం నాటికి ఎగువ నుంచి 2,800 క్యూసెక్కుల మేర నీరు చేరింది. దీంతో నీటి మట్టం 404.10 అడుగులకు చేరగా ఒక గేటు ఎత్తి 1000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశామని ఏఈ తెలిపారు. రిజర్వాయర్ దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

అశ్విని కుటుంబానికి న్యాయం చేస్తా..

- సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- గంగారం తండాలో నివాళులర్పించిన సీఎం, మంత్రి పొంగులేటి


అశ్విని, మోతీలాల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాం, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

కారేపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ ఆకేరు వరదలో మృతి చెందడం బాధాకరమని.. వారి కుటుంబానికి న్యాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. కారేపల్లి మండలం గంగారంతండాకు చెందిన తండ్రీకుమార్తె ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించి అశ్విని, మోతీలాల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా అశ్విని తల్లి నేజీ మాట్లాడుతూ బంగారు భవిష్యత్ ఉన్న బిడ్డ, భర్త చనిపోవడంతో తాము దిక్కులేని వారమయ్యామని బోరున విలపించింది. బిడ్డ రాయపూర్‌లో ఉద్యోగం చేస్తూ ఆమెకు వచ్చే జీతంతో ఇల్లు కట్టుకుందామని ప్రారంభిస్తే ఇప్పుడు ఆగిపోయిందని వెల్లడించింది. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి చేయూత ఇవ్వడంతో పాటు కుమారుడు అశోక్‌కు గ్రూప్–1 ఉద్యోగం ఇవ్వాలని, అశ్విని పింఛన్ తనకు ఇప్పించాలని కోరారు. దీంతో స్పందించిన సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌కు వస్తే అన్ని విషయాలు పరిశీలించి అండగా నిలుస్తామని తెలిపారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో పాటు బొర్రా రాజశేఖర్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోతు రామ్మూర్తి, అడ్డగోడ ఐలయ్య, మేదరి వీర ప్రతాప్, ఇమ్మడి తిరుపతిరావు, పెద్దబోయిన ఉమాశంకర్, ఆలోతు ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

వేగంగా పెరుగుతూ..


స్నాన ఘట్టాల వద్దకు చేరుకున్న వరద నీరు

- భద్రాచలం వద్ద 41.20 అడుగులకు చేరిన గోదావరి
- గంటగంటకూ పెరుగుతున్న నీటిమట్టం
- మరో రెండు రోజులు కొనసాగనున్న వరద ఉధృతి
- ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం నెమ్మదించగా.. మంగళవారం ఉదయం నుంచి వరద ఉధృతి గంటగంటకూ వేగంగా పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఇక్కడ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు 43 అడుగులు దాటి ప్రవహించడంతో ఆయా సమయాల్లో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆగస్టులో వరద ఉధృతి తగ్గినా.. నీటిమట్టం 19 అడుగుల మేర నమోదైంది. ఈ క్రమంలో ఆగస్టు 31న నీటిమట్టం పెరిగినా తెల్లవారే మళ్లీ తగ్గుముఖం పట్టింది. కాగా, మంగళవారం ఉదయం నుంచి వరద ప్రవాహం వేగంగా పెరగడంతో రాత్రి 11 గంటలకు 41.20 అడుగులకు చేరింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో గోదావరి వరద ఇంకా పెరగొచ్చని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద 43 అడుగులు దాటితే మొదటి, 48 అడుగులకు చేరితో రెండో, 53 అడుగుల మేర నమోదైతే మూడో ప్రమాద హెచ్చరికలను జారీ చేస్తారు.

పోలీసుల భద్రతా చర్యలు..
తెలంగాణతో పాటు మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరిలోకి వరద వస్తోంది. దీంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రి 9 గంటలకు 25.80 అడుగులు ఉండగా మంగళవారం ఉదయం 6 గంటలకు 27.40 అడుగులుగా నమోదైంది. ఆ తర్వాత 7 గంటలకు 28.20, 8 గంటలకు 29, 9 గంటలకు 30, 10 గంటలకు 31.50, 11 గంటలకు 32.40, మధ్యాహ్నం 12 గంటలకు 33.40 అడుగులకు చేరుకుంది. ఆ తర్వాత కూడా ఇదే వేగం కొనసాగిస్తూ మధ్యాహ్నం 2 గంటలకు 35.70 అడుగులు, 3 గంటలకు 36.80, సాయంత్రం 4 గంటలకు 37.70 అడుగులకు చేరింది. ఈ సమయంలో 7,09,810 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇక రాత్రి 11 గంటలకు 41.20 అడుగులుగా నమోదైంది. కాగా, బుధవారం ఉదయానికి మొదటి ప్రమాద హెచ్చరిక రావచ్చని సమాచారం. వరద స్నాన ఘాట్ వద్దకు చేరుకోవడంతో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులను స్నానాలకు అనుమతించలేదు.

కంట్రోల్ రూం ఏర్పాటు..
వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల వివరాలు తెలపడంతో పాటు సహాయ కార్యక్రమాలు అవసరమైన వారు 79952 68352 నంబర్‌కు ఫోన్ చేయాలని పీఓ బి.రాహుల్ సూచించారు. సబ్ కలెక్టరేట్‌లో 08743 – 232444, 79812 19425 నంబర్లలోనూ సంప్రదించవచ్చని పేర్కొన్నారు. గోదావరి వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

పంచాయతీ పోరుకు సిద్ధం కండి

అధికారులకు కలెక్టర్ పాటిల్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ ఎన్నికల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బందికి విధుల కేటాయింపు వంటి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, ఈ మేరకు అంచనాలు రూపొందించాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. భారీగా వరదలు వచ్చిన నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పంచాయతీ అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగి శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలన్నారు. చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతూనే గ్రామాలలో నిత్యం ఫాగింగ్ చేయాలని సూచించారు. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రధాన రహదారుల పక్కన ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. మరో నాలుగైదు రోజులు వర్ష సూచన ఉన్నందున ముంపు ప్రాంతాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో ముంపు ప్రాంత మండలాల్లోని గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. పునరావాస కేంద్రాలలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, సీపీఓ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేందర్, వ్యవసాయాధికారి బాబూరావు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ డాకూసింగ్, డీసీహెచ్ఎస్ రవిబాబు, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, డీపీఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'నవ' సేవలు అభినందనీయం
కొత్తగూడెంఅర్బన్: విద్య, వైద్యం వంటి సేవా కార్యక్రమాల్లో నవ లిమిటెడ్ చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నవ ఆధ్వర్యంలో మంగళవారం పాత కొత్తగూడెంలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్‌కు ఆధునాతన ఫర్నిచర్, పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో మహిళలు, నిరుద్యోగులకు ఆధునిక రంగాల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం నవ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ లింగం వెంకటశరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు త్వరలో దంత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ ఎం.రత్నకిషోర్, చీఫ్ లైజన్ ఆఫీసర్ వి.ఖాదరేంద్ర బాబు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు పాల్గొన్నారు.

సాహిత్యం.. భావితరాలకు ఆదర్శం
సాహిత్యం భావి తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, దీనికి తోడు నైపుణ్యం కూడా ఉంటే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని కలెక్టర్ పాటిల్ అన్నారు. ఆనందఖని ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలంగాణ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'జిల్లా సమగ్ర స్వరూపం' గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా చరిత్రను భావితరాలకు అందించడం శుభ పరిణామమని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, సరస్వతి పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య, సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రాపిడ్ ఫీవర్ సర్వే చేయండి

వైద్య సిబ్బందికి డీహెచ్ రవీందర్‌నాయక్ ఆదేశం


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీహెచ్

మణుగూరు టౌన్: మణుగూరులో వరద ముంపునకు గురైన వారికి రాపిడ్ ఫీవర్ సర్వే చేయాలని వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన సుందరయ్యనగర్, మేదరబస్తీ, లెనిన్‌నగర్‌లో డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్‌నాయక్‌తో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీరు తాగుతూ ఆరోగ్యాలను రక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించాలని, అనారోగ్యంతో ఉన్నవారిని వెంటనే ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వరదనీటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం 100 పడకల ఆస్పత్రిని సందర్శించి వార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో సమస్యలపై సూపరింటెండెంట్ సునీల్‌తో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ బాలాజీ నాయక్, వైద్యులు శివకుమార్, నిశాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల డేటా అప్‌లోడ్ చేయాలి
కొత్తగూడెంరూరల్ : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డేటాను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.ఎల్.భాస్కర్ నాయక్ సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్‌సీల సీనియర్ అసిస్టెంట్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బందికి రాయితీలను సకాలంలో అందించాలన్నారు. ఎన్‌హెచ్ఎం నిధులు, యుటిలైజేషన్ ఖర్చుల పట్టికలను తమ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు బాలాజీనాయక్, ఫైజ్ మొహిద్దీన్, సుదర్శన్, రతన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిమ్ క్రీడాకారులకు పతకాల పంట

ఇల్లెందు: పట్టణంలోని దుర్గా గోల్డెన్ జిమ్ క్రీడాకారులకు పతకాలు లభించాయి. సెప్టెంబర్ 1వ తేదీన భువనగిరిలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి 10వ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇల్లెందు దుర్గా జిమ్ క్రీడాకారులకు పలు విభాగాల్లో పతకాలు వచ్చాయి. భట్టు శ్వేత (49 కేజీల కేటగిరిలో) బంగారు పతకం సాధించారు. కంభాల అక్షిత (87 కేజీల కేటగిరిలో) రజత, సాయిశ్రీజ పాసీ (55 కేజీల కేటగిరిలో) కాంస్య పతకాలు సాధించగా.. పూజిత, సీహెచ్ గంగా భవాని నాలుగోస్థానంలో నిలిచారు.

కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



కొండరెడ్లకు పత్రాలు అందిస్తున్న ఏపీఓ

అశ్వారావుపేటరూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన కొండరెడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజు తెలిపారు. అశ్వారావుపేట మండలం పాతరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధి సుద్దగోతులగూడెంలో మంగళవారం పీఎం జన్‌ధన్ పథకంలో భాగంగా ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 51 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు, ముగ్గురికి ఆధార్ కార్డు, ఎనిమిది మందికి ఉపాధి హామీ జాబ్‌కార్డులతో పాటు 21 మందికి బ్యాంకు ఖాతాలు అందించారు. కార్యక్రమంలో ఏటీడీఓ చంద్రమోహన్, డాక్టర్ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొత్తగూడెంటౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు నెహ్రూబస్తీలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఏన్కూరు మండలం కేసుపల్లి గ్రామానికి చెందిన పగడాల నరేశ్, సిద్దల కాంతారావు, జెర్రిపోతుల హరీశ్, మందనపు ఆదర్శ్, కేలోతు సక్రియ, రామవరానికి చెందిన ఎస్‌కే పాషా కలిసి రూ.1,48,200 విలువైన రేషన్ బియ్యాన్ని కారు, ట్రాలీ, వాన్‌లలో తరలించేందుకు సిద్ధమయ్యారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. వాహనాలను సీజ్ చేశామని, నిందితులను అరెస్ట్ చేశామని ఆయన వివరించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన దుర్గారావు గుమ్మడవల్లి వద్దగల పెదవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, తహసీల్దార్ కృష్ణప్రసాద్ అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు.

హుండీలో నగదు చోరీ

పాల్వంచ: గుర్తు తెలియని వ్యక్తులు రామాలయం హుండీలోని నగదును చోరీ చేశారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని సీతారాంపట్నంలోని రామాలయంలోకి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ తాళాలు పగుల గొట్టి నగదును చోరీ చేశారు. మంగళవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్‌టీం వచ్చి పరిశీలించింది. కాగా హుండీలో సుమారు రూ.15 వేల వరకు నగదు ఉందని, వాచ్‌మెన్ సోమవారం రాత్రి రాకపోవడంతో అదే అదునుగా భావించి చోరీకి పాల్పడ్డారని తెలిసింది. ఎస్‌ఐ సుమన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

సింగరేణి క్వార్టర్లలో చోరీ

ఇల్లెందు: సింగరేణి జేకే కాలనీ అయ్యప్ప టెంపుల్ ఎదుట లైన్‌లో మూడు క్వార్టర్లలో అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆ క్వార్టర్లలో నివాసం ఉంటున్న వారు తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి ఇళ్లల్లో చొరబడి ఆభరణాలు చోరీ చేశారు. ఒక ఇంటిలో మూడు తులాల బంగారం, మరో ఇంటిలో 20 తులాల వెండి, రూ.70 వేల నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం చుట్టు పక్కల వారు చూసి బాధితులకు సమాచారం అందించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

పేకాటస్థావరంపై దాడి

అశ్వాపురం: మండలంలోని గొందిగూడెం అటవీ ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద పేకాట ఆడుతుండగా మంగళవారం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రూ.3 వేలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోడుదారులపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఫారెస్టు బీట్ ఆఫీసర్‌ను అడ్డుకున్న పలువురు పోడుదారులపై మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని లంకాలపల్లి బీట్‌లో భూములు న్యాయస్థానం పరిధిలో ఉండగా, వాగొడ్డుగూడేనికి చెందిన కొందరు పోడుదారులు నాగళ్లతో దున్నుతున్నారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీఓ మల్సూర్ ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకునేందుకు యత్నించగా దుర్భాషలాడారు. ఎఫ్‌బీఓ ఫిర్యాదు చేయగా 10 మంది పోడుదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆ నెత్తుటి గాథకు 32 ఏళ్లు..

- 1992 సెప్టెంబర్ 4న రాళ్లవాగు బ్రిడ్జిని పేల్చిన మావోయిస్టులు
- అమరులైన 10 మంది పోలీసులు
- ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఘటన



రాళ్లవాగు వద్ద నిర్వీర్యం చేస్తున్న మందు పాతర (ఫైల్)

కరకగూడెం: సమాజంలో సంఘ విద్రోహ శక్తులను తరిమి కొట్టేందుకు 24 గంటలూ విధులు నిర్వహిస్తుంటారు పోలీసులు. ఈ క్రమంలో ఎన్నో ప్రతిఘటనలు, సవాళ్లను ఎదుర్కొంటారు. సాయుధ శక్తులతో సమరం సాగించే సమయంలో ప్రాణ త్యాగానికి సైతం సిద్ధపడుతుంటారు. సరిగ్గా 32 ఏళ్ల క్రితం మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని పినపాక, కరకగూడెం ఏజెన్సీ ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వారిని అణిచివేసేందుకు పోలీసులు ప్రత్యేక వ్యూహాలు పన్నేవారు. ఈ క్రమంలో 1992 సెప్టెంబర్ 4న పినపాక – కరకగూడెం మండలాల మధ్య గల రాళ్లవాగు వద్ద మావోయిస్టులు బ్రిడ్జిని పేల్చేశారు. ఈ భారీ విస్ఫోటనానికి ఐదు మందుపాతరలను వినియోగించినట్లు అప్పట్లో పోలీసులు గుర్తించారు.

భద్రత కోసం వస్తూ..

మావోయిస్టుల కార్యకలాపాలను అరికట్టేందుకు కరకగూడెంలో నాటి ప్రభుత్వం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసింది. ఈ స్టేషన్ భద్రత కోసం ఏడూళ్ల బయ్యారం స్టేషన్ నుంచి 10 మంది పోలీసులు జీపులో కరకగూడెం వస్తుండగా.. వారిని లక్ష్యంగా చేసుకుని రాళ్లవాగు బ్రిడ్జి వద్ద మందుపాతర పేల్చారు. భారీ శబ్దం రావడంతో ఏజెన్సీ గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. స్థానికులు వచ్చి చూడగా తునాతునకలైన పోలీస్ వాహనం, చెట్టుకొకటి..పుట్టకొకటి అన్నట్టుగా పడి ఉన్న మృతదేహాలు కనిపించాయి.

నాడు అమరులైన పోలీసులు వీరే..

మావోయిస్టులు పేల్చిన మందుపాతర ఘటనలో అమరులైన పది మందిలో డి.నరేందర్ పాల్ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్), ఎస్‌ఏ.జార్జ్ (సబ్ ఇన్‌స్పెక్టర్), డి.ప్రభాకర్ రావు (ఏఆర్ ఎస్సై), ఐ.రామారావు (హెడ్ కానిస్టేబుల్)తో పాటు కానిస్టేబుళ్లు డి.శంకర్‌బాబు, జి.నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, వై.బేబీరావు, టి.సుబ్బారావు ఉన్నారు.

ఈ ఘటన నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెను సంచలనం సృష్టించింది.



పేల్చివేత తర్వాత గుంతలు పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు (ఫైల్)

అమరుల త్యాగాలు చిరస్మరణీయం..



పోలీస్ అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయం. వారి సేవలు వెలకట్టలేనివి. పోలీసులు ప్రజల మధ్యలో ఉంటూ సమాజ శ్రేయస్సే ధ్యేయంగా విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పని చేస్తారు. అలాంటి అమరులను నిత్యం స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం.

– రాజేందర్, ఎస్సై, కరకగూడెం

ఉలికి పాటుకు గురిచేసింది



రాళ్లవాగు బ్రిడ్జిని మావోయిస్టులు పేల్చివేశారనే వార్త వినగానే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం. ప్రజల కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పది మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇప్పటికీ ఆ విషాద ఛాయలు మా మదిలోనే ఉన్నాయి.

– సార భిక్షం, కరకగూడెం గ్రామస్తుడు

స్మరించుకోవడం అందరి బాధ్యత



సమాజ శ్రేయస్సే లక్ష్యంగా విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం అందరి బాధ్యత. అలాగే అమరుల కర్తవ్యం, త్యాగాలను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి. రాళ్లవాగు ఘటనలో పోలీసులను కోల్పోవడం దురదృష్టకరం.

– రోహిత్ రాజ్, ఎస్పీ

లక్ష్మీనగరంలో పాఠశాల ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో మంగళవారం పాఠశాల ప్రారంభం కావడంతో గ్రామస్తులు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దుమ్ముగూడెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రామారావు, పర్ణశాల జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాఠశాలను ప్రారంభించారు. గ్రామంలోని సీఎస్‌ఐ పాఠశాల అర్ధంతరంగా మూసివేయడంతో విద్యార్థులు కొందరు ప్రైవేట్ పాఠశాలకు, మరి కొందరు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్తుండటంతో గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని డీఈఓను ఆదేశించారు. డీఈఓ ఆదేశాల మేరకు మండల అధికారులు డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయురాలిగా ఎ.సుశీలను నియమించడంతో పాఠశాల పునఃప్రారంభమైంది. కార్యక్రమంలో గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, వీరేందర్, అన్వర్, వేమన, గూడవల్లి శ్రీను, ఎండీ బేగ్, నటరాజ్ స్వామి, డింగి కన్నా, సందీప్, నరేంద్ర, వెంకటేశ్, మురళి, శిరపు శివ, శ్రీధర్, పవన్, శిరపు అప్పల్‌రెడ్డి, బత్తుల శోభన్, శ్రీహరి, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు

'బీఆర్‌ఎస్' రాస్తారోకో

మణుగూరురూరల్: భారీ వర్షానికి తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పూలమార్కెట్ సెంటర్‌లో పట్టణ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. వరదల వల్ల ఇళ్లల్లోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, పునరావాస కేంద్రాల్లోని బాధితులకు సరైన భోజనం, మంచినీటి వసతి కల్పించకపోవడం బాధాకరమన్నారు. పంటలు మునిగిన రైతులకు, ఇళ్లు, మూగజీవాలను కోల్పోయిన బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ సతీశ్‌కుమార్ అక్కడికి చేరుకుని నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో రేగా కాంతారావును అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో కుర్రి నాగేశ్వరరావు, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కిన్నెరసాని వాగులో గల్లంతై ఇద్దరు మృతి

రెండు రోజుల తర్వాత మృతదేహాలు లభ్యం



వెంకటేశ్వర్లు, సాయికుమార్ (ఫైల్)

టేకులపల్లి: శుభకార్యానికి హాజరయ్యేందుకు వెళ్లి ఇద్దరు వ్యక్తులు వాగులో కొట్టుకుపోయిన మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. బోడు ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కొమరం వెంకటేశ్వర్లు (29), ఆయన బావమరిది దొడ్డ సాయికుమార్ (23) ఆదివారం ద్విచక్రవాహనంపై మేడారంలో శుభకార్యం ఉండటంతో వెళ్లారు. భారీ వర్షం, వరదల కారణంగా అక్కడికి వెళ్లలేక గుండాల నుంచి తిరిగి వస్తూ.. ఏపెలగడ్డ సమ్మక్క, సారక్క గద్దెల వద్ద ఇంకో బంధువు శుభకార్యం ఉంటే అక్కడ భోజనం చేశారు. రాత్రి ఆళ్లపల్లి మండలం రాయిపాడు కిన్నెరసాని బ్రిడ్జి మీదుగా లచ్చగూడెం వెళదామని బయలుదేరి, అక్కడి వరదలో కొట్టుకుపోయారు. మరుసటి రోజు ఇద్దరూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద ఆరా తీశారు. రాత్రి అయినా ఆచూకీ లభించలేదు. దీంతో బోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం బోడు ఎస్‌ఐ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో గజ ఈతగాళ్లను పిలిపించి, వెతికించగా లక్ష్మీదేవిపల్లి మండలం బంగారుచెలక – చింతకుంట మధ్యలో రెండు మృతదేహాలు లభించాయి. మృతులు వెంకటేశ్వర్లుకు భార్య, ఏడాది పాప ఉండగా, సాయికుమార్‌కు ఇటీవలె వివాహమైంది. ఘటనా స్థలాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు కోరం సురేందర్‌తో పాటు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీందర్‌రావు, సీఐ తాటిపాముల సురేశ్, కార్యదర్శులు రమాదేవి, కవిత తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

భర్త చేతిలో భార్య హతం



రాధ (ఫైల్)

పాల్వంచరూరల్: వివాహిత హత్యకు గురైన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సంగం గ్రామానికి చెందిన కాయిత రాధ (28)కు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న కాయిత రాముతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. అయితే, భార్యను అనుమానిస్తుండటంతో తాళలేక రాధ.. గత నెల 30న సంగం గ్రామానికి వచ్చింది. భర్త కూడా ఈ నెల 1వ తేదీన భార్య వద్దకు వచ్చాడు. రెండో తేదీ రాత్రి రాధ తలపై దిండును మోది, మెడ పిసికి హత్య చేసిన అనంతరం రాము పరారయ్యాడని మృతురాలి సోదరుడు ప్రసాద్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. మృతురాలికి బాబు నిశిత్, పాప నిశిక ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

కొత్తగూడెంరూరల్: వరకట్న వేధింపులు తాళలేక వివాహిత పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల గ్రామానికి చెందిన భూక్య జ్యోతి(28)కి, అదే గ్రామానికి చెందిన భూక్య అరుణ్ కుమార్‌తో గతేడాది వివాహం జరిగింది. ఏడాది కాలంలోనే దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరగగా పెద్దలు పంచాయితీ చేశారు. అదనపు కట్నం కావాలంటూ భర్త, అత్త మామలు వేధింపులకు గురిచేయడంతో పుట్టింటికి వచ్చి జ్యోతి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భర్త అరుణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జ్వరంతో మహిళ..

ములకలపల్లి: జ్వరంతో బాధపడుతూ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ఆనందపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఒగ్గెల కన్నయ్య, వెంకమ్మ(60) దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వెంకమ్మ వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతూ, స్థానికంగా చికిత్స పొందుతోంది. సోమవారం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో పాల్వంచ ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

మద్యానికి బానిసై వ్యక్తి..

కరకగూడెం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎస్.సాంబయ్య (40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల కాలుకు గాయం కావడంతో ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేసిన అతను తీవ్ర అనారోగ్యానికి గురై ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుడుంబా తయారీదారుడు బైండోవర్

జూలూరుపాడు: నాటుసారా తయారుచేసి బైక్‌పై తరలిస్తూ పట్టుబడిన వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన బానోత్ హతీరామ్ ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తూ ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డాడు. హతీరామ్‌ను తహసీల్దార్ స్వాతిబిందు ఎదుట మంగళవారం హాజరు పరిచారు. మరోసారి నాటుసారా తయారు చేసినా, విక్రయించినా రూ.2 లక్షలు జరిమానా, లేదా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

మావోయిస్టు లొంగుబాటు

కొత్తగూడెంటౌన్: సీపీఐ మావోయిస్టు చర్ల ఏరియా కమిటీ సభ్యుడు మడకం అయితాల్ పోలీసుల ఎదుట లొంగియాడు. ఆయన తలపై రూ.4 లక్షల రివార్డు ఉందని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. చర్ల మండలం కొరకటపాడు గ్రామానికి చెందిన అయితాల్ అలియాస్ అయితా జిల్లా పోలీసులు, 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయారని తెలిపారు. మడకం అయితా 2017లో మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యుడిగా చేరి, కమాండర్ అయిన సోడి జోగయ్యతో కలిసి 2020 వరకు పనిచేశాడని, సోడి మృతి తర్వాత ఇతను దళ సభ్యుడిగా ప్రమోషన్ పొంది చర్ల ప్లాటూన్‌లో పని చేశాడన్నారు. 2021లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందాడని, ఇతనిపై రూ.4 లక్షల రివార్డు ఉందని ఎస్పీ వివరించారు. సాధారణ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని అయినా లొంగిపోయారని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా లొంగిపోయిన మావోయిస్టు దళ సభ్యులు, మిలీషియా సభ్యులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డులను ఎస్పీ రోహిత్‌రాజు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సంక్వార్, దుమ్ముగూడెం సీఐ అశోక్, ఎస్‌ఐ వెంకటప్పయ్య పాల్గొన్నారు.

వైద్యుడికి బెదిరింపు కాల్స్



డీఎస్పీతో మాట్లాడుతున్న వైద్యుడు శశిధర్

మణుగూరుటౌన్: తనను కొందరు వ్యక్తులు వేధిస్తున్నారని, తాము అడిగినంత డబ్బు ఇవ్వకుంటే మణుగూరు నుంచి వెళ్లిపోవాలంటూ హెచ్చరిస్తున్నారని మణుగూరు మండలానికి చెందిన వైద్యుడు శశిధర్ మంగళవారం సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశారు. వారి పేర్లు రాసి, తన ఇంట్లో బీరువాలో పెట్టానని, తనకు, తన కుటుంబానికి ఏమైనా జరిగితే వారే బాధ్యులంటూ వీడియోలో పేర్కొన్నారు. ఇది వైరల్‌గా మారడంతో ప్రముఖులు, తోటి వైద్యులు, మెడికల్ షాపుల యజమానులు, రక్తపరీక్ష కేంద్రాల నిర్వాహకులు ఆయనకు అండగా నిలవడమే కాక డీఎస్పీ రవీందర్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. దీంతో ఆయన మాట్లాడుతూ.. అలాంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, ఏజెన్సీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఏ సమయంలోనైనా తనను కలవొచ్చని, బెదిరించిన వ్యక్తులపై లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని చెప్పారు.

పది రోజుల్లో రింగ్‌బండ్ పూర్తిచేయాలి



రింగ్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, తదితరులు

అశ్వారావుపేటరూరల్: రానున్న పది రోజుల్లో పెదవాగు ప్రాజెక్టు వద్ద రింగ్‌బండ్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 1వ తేదీన కురిసిన భారీ వర్షాలు, వరద కారణంగా రూ.3.5 కోట్ల వ్యయంతో పెదవాగు ప్రాజెక్టు లోపలి భాగంలో నిర్మిస్తున్న రింగ్‌బండ్ మట్టికట్ట కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే ప్రాజెక్టును సందర్శించి, వరదలో కొట్టుకుపోయిన రింగ్‌బండ్ నిర్మాణాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణ ప్రాంత రైతులకు ఈ సీజన్‌లో నీరందించే ఉద్దేశంతో ప్రభుత్వం తాత్కాలికంగా రింగ్‌బండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, కానీ, వరద కారణంగా దాదాపు 30 మీటర్ల దాకా రింగ్‌బండ్ కొట్టుకుపోయిందని, మరో పది రోజుల్లో రింగ్‌బండ్‌ను పునఃనిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జూపల్లి రమేశ్, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేశ్, బండి చెన్నారెడ్డి, మిండా హరి పాల్గొన్నారు.

'పెదవాగు' శాశ్వత మరమ్మతులపై దృష్టి



పెదవాగు వద్ద రింగ్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, అధికారులు

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు ఈ నెల 10వ తేదీన గోదావరి రివర్ బోర్డు చైర్మన్‌తో ప్రత్యేకంగా సమావేశం అవుతున్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టును ఆకస్మికంగా సందర్శించి, తాజాగా వరదతో కొట్టుకుపోయిన రింగ్ బండ్ మట్టికట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షం, వరద పోటు కారణంగా పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు పడిన గండ్లకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కాగా, ఈ ప్రాజెక్టు కింద అధిక శాతం ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోనే ఆయకట్టు ఉందని, ఈ రెండు మండలాలు పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్న నేపథ్యంలో పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు కేటాయించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ సురేశ్‌కుమార్, డీఈ మోతీలాల్, ఏఈలు వంశీ, నవీన్, ప్రకాశ్ ఉన్నారు.

సీతారామ కాల్వకు గండి



గండి నుంచి ప్రవహిస్తున్న వరద



నీట మునిగిన పత్తిపంట

చండ్రుగొండ : మండలంలోని మద్దుకూరు గ్రామ శివారు నుంచి వెళ్తున్న సీతారామ కాల్వకు మంగళవారం గండి పడింది. భారీగా నీరు ప్రవహిస్తుండటంతో ఆయకట్టులోని పంటపొలాలు నీటమునిగాయి. నష్టం పాక్షికమే అయినప్పటికీ ఇదే తరహాలో వరద కొనసాగితే పత్తి, వరి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల మీద నుంచి వరద నీరు మద్దుకూరు ప్రాజెక్టులోకి చేరుతోంది. అధికారులు సత్వరమే స్పందించి గండి పూడ్చే పనులు చేపట్టాలని కోరుతున్నారు.

బాల్య వివాహంపై కేసు

టేకులపల్లి: బాల్య వివాహంపై ఐసీడీఎస్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ పోగుల సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని తడికలపూడి పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఆగస్టు 9న రాత్రి 10 గంటల సమయంలో 22 ఏళ్ల యువకుడికి, 15 ఏళ్ల బాలికతో వివాహం జరిగింది. 29న బాల్య వివాహంపై చైల్డ్ వెల్ఫేర్ టోల్ ఫ్రీ నంబర్ 1098కి ఫోన్ ద్వారా ఫిర్యాదు అందింది. 31న టేకులపల్లి ఐసీడీఎస్ అధికారులు ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి బాలికను మణుగూరులోని చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు మంగళవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువైద్యశాలలో షార్ట్ సర్క్యూట్

చర్ల: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు చెలరేగాయి. మంగళవారం మధ్యాహ్నం పశు వైద్యశాలలోని విద్యుత్ స్విచ్ బోర్డు నుంచి మంటలు చెలరేగాయి. ఈ సందర్భంలో వైద్యశాలలో ఉన్న వీఎస్‌ఏ సురేశ్‌కుమార్ మంటలను గమనించి మెయిన్‌స్విచ్ ఆఫ్ చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. స్విచ్ బోర్డు నుంచి లేచిన మంటలు మందులు నిల్వ ఉన్న ప్రాంతానికి సైతం వ్యాపించడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ సందర్భంలో స్థానికులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని అందులో ఉన్న ఇతర సామగ్రి, మంటలు అటుకోని మందులను బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని సిబ్బంది తెలిపారు.